క్లుప్తంగా

ముగ్గుల పోటీలను జయప్రదం చేయండి

నెల్లికుదురు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ), సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన జరిగే సంక్రాంతి ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మంగళవారం పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి రూ. 5,016, ద్వితీయ బహుమతి రూ.3,016, తృతీయ బహుమతి రూ.2,016, నాల్గో బహుమతి రూ. 1,016, కన్సోలేషన్ బహుమతులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 98664 79666, 99593 43360, 96660 38001 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ పాఠశాల అవార్డు ప్రదానం



మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ నోవాటెల్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల బృందానికి మంగళవారం హెచ్‌వైబీ12 టీవీ సంస్థ ప్రతినిధులు ప్రీతిరెడ్డి, బూరనర్సయ్య గౌడ్ చేతుల మీదుగా ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ ఉత్తమ పాఠశాల–2024 అవార్డును అందజేశారు.

సింహాసనంపై గోదారంగనాథులు



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా విశేషంగా సింహాసనపట్టు పాశురంను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరామ ఆలయంలో గోదారంగనాథులకు ప్రధాన అర్చకులు ముత్తేవి వెంకటకృష్ణప్రసాద్, ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ప్రత్యేక పూజలు చేసి సింహాసనంపై కొలువుదీర్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మహబూబాబాద్ రూరల్: వేదాస్ రాష్ట్ర స్థాయి క్యాలెండరును ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోత్కూరి వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విశ్వకర్మ ఎంప్లాయిస్ నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరబ్రహ్మచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వకర్మ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓకార్, ప్రధాన కార్యదర్శి చెన్నోజు విజయ్‌కుమార్, కోశాధికారి ఉల్లి విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

కురవి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని గుండ్రాతిమడుగు(విలేజి) జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.జానయ్య తెలిపారు. గత ఏడాది ఆగస్టులో భారీగా కురిసిన వర్షాలకు పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద వరదలో కొట్టుకపోయి మృతి చెందిన సైంటిస్ట్ డాక్టర్ నూనావత్ అశ్విని జయంతిని పురస్కరించుకుని ఆమె సోదరుడు నూనావత్ అశోక్ కుమార్ సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులందరికి డైరీలు, క్యాలెండర్లను మంగళవారం బహూకరించారు. కార్యక్రమంలో అజ్మీరా రామునాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కార్యదర్శుల ఆందోళన



నర్సింహులపేట: విధులకు ఆటంక పరిచిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని గోల్‌బోడ్కతండా జీపీకి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భూక్య సుధాకర్‌ను మంగళవారం మాజీ సర్పంచ్ భర్త కిషన్ ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడాడని, విధులకు ఆటంక పరిచారన్నారు. అతడిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తు పంచాయతీ కార్యదర్శులు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ విషయమై పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు

లక్ష్యం.. నిర్లక్ష్యం

- పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో క్రీడా ప్రాంగణాలు
- సీఎంకప్‌లో కానరాని క్రీడాకారుల ప్రాక్టీసు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అబ్బాయిపాలెం గ్రామంలో చెరువు శిఖంలో క్రీడాప్రాంగణం



ఆనెపురంలో మంచి నీటి బావికి ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

మరిపెడ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి జిల్లా, రాష్ట్రస్థాయిలో తీసుకెళ్లాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామానికో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మైదానానికి రూ.5లక్షలు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయడంతో సఫలీకృతమైంది. కొన్ని గ్రామాల్లో మైదానాల్లో ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడుండగా.. మరికొన్ని గ్రామాల్లో దూరంగా గుట్టల ప్రాంతం, చెరువు శిఖాల్లో ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో అధికారులు అక్కడ క్రీడా మైదానం ఉందన్న సంగతే మరిచారు.

నిర్వహణ మరిచిన అధికారులు..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు నిర్వహణ లేకపోడంతో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతోపాటు చెత్తా చెదారంతో నిండుకున్నాయి. మరికొన్ని చోట్ల వ్యాయం కోసం ఏర్పాటు చేసిన సామగ్రి సైతం కనిపించకుండా పోయాయి. పలు క్రీడా మైదానాల్లో పంటలు కూడా సాగుచేస్తుండం విశేషం.

వసతులు కల్పించాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించాలి. అన్యాక్రాంతం అవుతున్న క్రీడా మైదానాలను నిర్వహణలోకి తేవాలి. క్రీడలతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. అందుకు అనుగుణంగా సామగ్రిని ఏర్పాటు చేసి ప్రాక్టీసు చేసుకునేలా అధికారులు చొరవచూపాలి.

– తాళ్ల కరుణాకర్, క్రీడాకారుడు, వీరారం

సీఎం కప్‌లో కానరాని ప్రాక్టీసు..

ఇటీవల సీఎం కప్ పోటీలు జరిగాయి. మైదానాల నిర్వహణ లేక గ్రామీణ క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్ ప్రాక్టీసు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రాక్టీసు లేకుండా నేరుగా వెళ్లి పోటీల్లో పాల్గొనడంతో అనుకున్న లక్ష్యాన్ని చేదించడంలో విఫలమయ్యారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 461 గ్రామ పంచాయతీల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులను తయారు చేసిన అధికారులు అందుకు సంబంధించిన సామగ్రిని సమకూర్చకపోవడంతో ప్రస్తుతం నిరుయోగంగా మారాయి. క్రీడాకారుల కోసం అన్ని రకాల సామగ్రితో కిట్‌ను ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించినా ప్రస్తుతం అవి కూడా ఎక్కడ కనిపించడం లేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేక దాతల సహకారం అందక క్రీడామైదానాలు ఏర్పాటు కాలేదు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను మంగళవారం డివిజన్ కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారితో కలిసి స్థానిక ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు ఆలస్యమయ్యేవని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు అందిస్తుందన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి మాట్లాడుతూ.. 317 జీఓతో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు టి.చంద్రప్రకాష్, కార్యదర్శులు చంద్రమౌళి, ప్రభాకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలి

- మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ సారంగం



మాట్లాడుతున్న డాక్టర్ సారంగం

కురవి: ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణిలను ప్రభుత్వ ఆస్పత్రి ప్రసవాలకు ప్రోత్సహించాలని మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గత నెలలో జరిగిన అబార్షన్లపై సమీక్షించి క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు మొదటి కాన్పులో ఆడపిల్లలు ఉండి రెండోసారి గర్భం దాల్చిన వారిపై నిఘా ఉంచాలని సూచించారు. సికిల్‌సెల్ ఎనిమియా స్క్రీనింగ్ కేసులను వందశాతం పూర్తి చేయాలని, వ్యాధి నిరోధక టీకాలను వందశాతం చేయాలని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి సుధీర్‌రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సంగారెడ్డి నుంచి భద్రాచల రాముడి చెంతకు..

- ప్రజాక్షేమం కోసం పాదయాత్ర
- రోజుకు 45 కిలోమీటర్ల ప్రయాణం



పాదయాత్రలో రామభక్తులు

బయ్యారం: ప్రజలు క్షేమంగా ఉండాలని సుదూర ప్రాంతం నుంచి పలువురు భక్తులు మూడేళ్ల నుంచి భద్రాచల రాముడి చెంతకు పాదయాత్రగా వస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం దేగుల్‌వాడి గ్రామానికి చెందిన 11 మంది భక్తులు మూడు సంవత్సరాల నుంచి వైకుంఠ ఏకాదశికి ముందు తమ గ్రామం నుంచి సుమారు 500 కిలోమీటర్ల దూరం ఉన్న భద్రాచలం రాములవారి ఆలయానికి పాదయాత్ర చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం వారు మహబూబాబాద్ జిల్లా నుంచి భద్రాద్రి జిల్లాలోకి ప్రవేశించారు. లోకకల్యాణార్థం తాము రోజుకు 45 కిలోమీటర్ల చొప్పున నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని సభ్యులు పేర్కొన్నారు. పాదయాత్ర చేస్తున్న వారిలో అంబదాస్‌చారి, మోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దిలీప్‌పటేల్, కార్తీక్‌రెడ్డి, తరుణ్‌పటేల్, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్.నర్సింహులు, ఎమ్. నర్సింహులు, శ్రీనివాస్, జగన్ ఉన్నారు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న యువతి మృతి

డోర్నకల్: మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మపాలెంకు చెందిన ఎల్లబోయిన స్వాతి(19) గత నెల 18న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి నాయినమ్మ భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా తన మనవరాలికి నెల రోజుల క్రితం పెళ్లి సంబంధం కుదిరిందని, మృతిపై తమను అనుమానాలు ఉన్నాయని భూలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్సు అద్దాలు ధ్వంసం

కొత్తగూడ: గుర్తు తెలియని వ్యక్తి విసిరిన రాయికి మహబూబాబాద్–కొత్తగూడకు వచ్చే ఆర్టీసి బస్సు అద్దం పగిలిన సంఘటన మండల కేంద్రం సమీపంలో జరిగింది. బస్సు డ్రైవర్ శ్రావన్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కంకర రోడ్డులో నెమ్మదిగా వెళ్తుడగా గుర్తు తెలియని వ్యక్తి బస్సు వెనక నుంచి రాయి విసిరాడు. దీంతో వెనక వైపు ఉన్న అద్దం పగిలిపోయి రాయి బస్సులో పడింది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. విషయాన్ని కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్ వివరించాడు.

కూలీలకు గాయాలు

మహబూబాబాద్ రూరల్: వరి నాట్లు వేసి ఇంటికి వెళ్తున్న కూలీల్లో ఇద్దరికి గాయాలైన సంఘటన మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన పలువురు కూలీలు పర్వతగిరి గ్రామంలో వరి నాట్లు వేసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎస్ వాహనంలో ఇంటికి వెళ్తుండగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమీపంలో ఎదురుగా వెళ్తున్న ఓ లారీ హఠాత్తుగా ఆగిపోయింది. వెంటనే టాటా ఎస్ వాహనం సడన్ బ్రేక్ వేయగా అది అక్కడే నిలిచిపోగానే దాని వెనకాలే వస్తున్న ఓ అప్పి ఆటో ఒక్కసారిగా టాటాఎస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఎస్ వాహనం వెనుక భాగంలో కూర్చున్న దేవనబోయిన యాదమ్మ, గంగాధరి పద్మకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డోర్నకల్: రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం హన్మంతులపాడుకు చెందిన సీమ రాములు(58) నవంబర్ 9న ఆటోలో తొడేళ్లగూడెంలో శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో ఆటో బోల్తా పడి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు రాములును హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చిన్నగూడూరు: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని చిన్నగూడూరు ఎస్సై ఝాన్సీ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రోడ్డు భద్రతా నియమాలను సరిగా పాటించకపోవడం ద్వారా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నర్సింహులపేట: మండలంలోని జయపురం శివారు అకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న శ్రీనివాస్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ప్రభుత్వ హామీలను అమలు చేయాలని నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలం అయ్యారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సుర్లపు సోమయ్య కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి, పట్టన కార్యాదర్శి బానోత్ సీతారాంనాయక్, పట్టణ కమిటీ సభ్యులు రావుల రాజు, హేమానాయక్ పాల్గొన్నారు.

పేదల సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?

కురవి: ప్రజాపాలనలో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమెప్పుడు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. మంగళవారం ప్రజాసమస్యలపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నాయకులు నల్లపు సుధాకర్, పిట్టల వెంకన్న, కడియం సత్యం, పోతుగంటి మల్లయ్య, నాలం వెంకన్న, కట్ల కృష్ణయ్య, గంధసిరి శ్రీనివాస్, మాలోత్ కిషన్‌నాయక్, జక్కుల మల్లయ్య, రాయల మనోహర్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి సరికాదు



తొర్రూరు: నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

తొర్రూరు: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడులు సరికాదని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్ అన్నారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొలుపుల శంకర్, నాయకులు పులేందర్, కాగు నవీన్, గడల శేఖర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర రావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, నాయకులు ఇందుభారతి, సంపత్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై, కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి విమల్‌కుమార్‌జైన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

డోర్నకల్: పథకాల అమలులో విఫలమై ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై దాడి చేశారని బీజేపీ రాష్ట్ర నాయకుడు కాపరబోయిన సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బానోత్ దేవానాయక్ మంగళవారం తెలిపారు.

హమాలీ కార్మికుల సమ్మె విరమణ

నెల్లికుదురు/కేసముద్రం/గార్ల: రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వంకాయలపాటి జక్కరయ్య అన్నారు. సమ్మె చేపట్టిన సివిల్ సప్లై కార్మికులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీతో మంగళవారం సమ్మె విరమించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, అల్లరి లక్ష్మీనారాయణ, భూమయ్య, ఎస్.వెంకన్న, రంజిత్, శోభన్, మహేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చోరీపై పోలీసుల దర్యాప్తు

నర్సింహులపేట: మండల కేంద్రంలో ఎరనాగి సీతారాములు ఇంట్లో జరిగిన భారీ చోరీపై మంగళవారం మరిపెడ సీఐ రాజ్‌కుమార్, సీసీఎస్ సీఐ హతిరాం, క్లూస్ టీం సిబ్బంది ఇంటిని పరిశీలించారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. మండల కేంద్రంలో పట్టపగలు జరిగిన భారీ చోరీపై పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో క్రికెట్ టోర్నమెంట్‌ను మానుకోట రూరల్ సీఐ సర్వయ్య హాజరై టీషర్ట్‌ను పంపిణీ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై దీపికరెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 32మంది విద్యార్థులతో కూడిన స్కౌట్ టీం మంగళవారం సిద్ధమైంది హెచ్ఎం సక్రు, పీడీ ధరావత్ మోహన్ నాయక్ దుస్తులను పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి

నెల్లికుదురు: దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించే డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య రైతులను కోరారు. ఈమేరకు మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవులు, రవీందర్, కొమురయ్య, వెంకన్న, వీరన్న పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తొర్రూరు: ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. ఈమేరకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో తహసీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి యాకూబ్, సోమిరెడ్డి, సాయిమల్లు, సాంబయ్య, శ్రీను పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

డోర్నకల్: సమగ్ర శిక్షాభియాన్ పరిధిలోని కస్తూర్బా పాఠశాల సిబ్బందితోపాటు ఎమ్మార్సీ కార్యాలయ పరిధిలోని ఎమ్మార్సీలు, సీఆర్పీలు మంగళవారం విధుల్లో చేరారు. ఎంఈఓ ఆంగోత్ లక్ష్మాకు విధుల్లో చేరుతున్నట్లు లేఖ అందించారు.

నిందితులను శిక్షించాలి

నెల్లికుదురు: ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్ట్ ముకేష్ చంద్రకర్‌ను హత్యచేసిన నిందితులను కఠిన శిక్షించాలని డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టుల భద్రతకోసం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

హైబ్రిడ్ విత్తనాలతో అధిక దిగుబడులు

గార్ల: హైబ్రిడ్ మిరప విత్తనాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. మంగళవారం మండలం లోని ఆంగోత్‌తండాలో గోగ్యానాయక్ అనే రైతు శరణ్య–151 హైబ్రిడ్ మిరప విత్తనాలతో సాగుచేసిన తోటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీ ఎండి అక్షయ్య, జిల్లా డిస్ట్రిబ్యూటర్ లింగాల సురేష్, ఎస్ఓ శివలాల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ధైర్యం కోల్పోవద్దు

గూడూరు: విద్యార్థులు ఏ పరిస్థితుల్లోను ధైర్యం కోల్పోకుండా ఉండాలని, నిరంతర సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని ప్రిన్సిపాల్ పరశురాములు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం హెల్ప్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎం.కుమార్‌చే యోగాసనాలు, మెడిటేషన్ పై శిక్షణ నిర్వహించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కురవి: మండల కేంద్రానికి చెందిన దళిత నాయకుడు కిన్నెర మల్లయ్యకు సావిత్రిబాయి పూలే ఎక్సలెంట్ జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రజనీకాంత్ అవార్డు గ్రహీత మల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కొర్ని అనిల్, దైద వీరయ్య, ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మినీ ట్రాన్స్‌ఫార్మర్



డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీహెచ్ఎస్ రోడ్డులో మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. సిమెంటు దిమ్మెపై ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్ చేతికందేంత ఎత్తులో ఉండటం, స్టే వైర్లు బురద గుంతలో ఉండటంతో ప్రమాదకరంగా మారింది. రెండు నెలల క్రితం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం సిమెంటు దిమ్మెను ఎత్తుగా నిర్మించినా ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడం లేదు. విద్యుత్ అధికారులు మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తైన దిమ్మెపైకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

సీఐటీయూలో చేరిక

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్‌కేవీ కార్మిక విభాగం నుంచి సీఐటీయూ కార్మిక విభాగంలోకి మున్సిపల్ కార్మికులు మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తప్పెట్ల శ్రీకాంత్, దాసరి మనోహర్, పార్నంది కృష్ణ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కాంట్రాక్ట్ ఉద్యోగులు

గూడూరు: సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్న మండల ఎమ్మార్సీ, సీఆర్పీలు, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది జేఏసీ చర్చలు సఫలం కావడంతో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ సమక్షంలో తిరిగి విధుల్లో చేరారు. వారిలో శోభన్‌రెడ్డి, రవికుమార్, నరేష్, బావుసింగ్, సరిత, జితేందర్, సుధాకర్, సంపత్, వెంకట్, ఉమేష్ పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

బయ్యారం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించటమే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రాచారి, ఏఎంఓ ఆజాద్, డీసీజీఓ విజయకుమారి, ఉపాధ్యాయులు భిక్షం, ధనుంజయ్, లక్ష్మీనారాయణ, దస్తగిరి పాల్గొన్నారు.

కబ్జా భూమిని సర్వే చేయాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని 107 సర్వే నంబర్‌లో1–34 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ఓంనారాయణ భూమిని సర్వే చేయాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కృష్ణవేణికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విష్ణునాయక్, వెంకటేష్, మంగీలాల్ నాయక్, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

'రెండు రోజుల్లో పూర్తి కానున్న ధాన్యం కొనుగోళ్లు'

గార్ల: మండలంలో మరో రెండు రోజుల్లో వరిధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తహసీల్దార్ రవీందర్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 2,24,000 బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని, వీటిలో 1,96,626 బస్తాల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు